



## ఓట్‌చోరీతోనే బండి సంజయ్ గెలుపు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్

7

## న్యూస్ బాక్స్

### బాంసెఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

గొల్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న బాంసెఫ్ (బ్యాక్ వర్డ్ అండ్ మైనారిటీస్ కమ్యూనిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్), రాష్ట్రీయ మూల్ నివాసీ సంఘ్ (ఆర్ఎంఎస్) 12వ రాష్ట్ర మహాసభలకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీవైఎం(భారతీయ యువ మోర్చా) రాష్ట్ర నాయకుడు రఘువీర్ పిలుపునిచ్చారు. ఆదివారం గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బాంసెఫ్, ఆర్ఎంఎస్ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను బాంసెఫ్ జిల్లా అధ్యక్షుడు రెవెళ్లి రవీందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక సమస్యల మీద పోరాడుతున్న సంఘం బాంసెఫ్ అని పేర్కొన్నారు. ఓబీసీ కుల గణన జరపాలని, ఈవీఎంలను తొలగించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా దేశంలోని ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ బహుజన సమాజాన్ని చైతన్యం చేస్తూ పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. బాంసెఫ్ రాష్ట్ర మహాసభలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాంసెఫ్ కోశాధికారి బంగారు జితేందర్, నాయకులు వంశీ, రెవెళ్లి సచిన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### బీసీల యుద్ధభేరిని విజయంతం చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 31న రవీంద్రభారతిలో నిర్వహించే బీసీ యుద్ధ భేరిని విజయవంతం చేయాలని కోరారు. పార్టీపరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఎండి ముక్తార్, రవి, రమేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులకు జలసిరి..

- జిల్లాలో మొత్తం చెరువులు...1,072
- మత్తడి పారుతున్న చెరువులు...411
- పూర్తిగా నిండినవి 200
- సగానికిపైగా నిండిన చెరువులు 134
- సాగునీటికి తీరిన కొరత
- జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదు



ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌లో నిండుకుండలా పెద్దమ్మ చెరువు

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదనీటితో చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. వందల సంఖ్యలో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అధిక వర్షపాతం నమోదై వరద పోటెత్తడంతో చెరువులు, కుంటలు, ఇతరత్రా జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి మత్తడి మీద నుంచి పారుతున్నాయి. జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు వరద కాలువ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, రోళ్లవాగు ప్రాజెక్టు, బొమ్మెన ప్రాజెక్టు, రాళ్లవాగు ప్రాజెక్టు, సుమారు 35 ఎత్తిపోతల పథకాలు, పలు రిజర్వాయర్లలో, చిన్నాచితక ప్రాజెక్టుల్లో జలకళ ఉట్టిపడుతోంది. దీంతో జిల్లాలోని ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**● 60,000 ఎకరాల ఆయకట్టు..**

జిల్లావ్యాప్తంగా 1,072 చెరువులు, కుంటలున్నాయి. వీటి కింద సుమారు 60,000ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన చెరువులు 166 కాగా, వంద ఎకరాల్లోపు ఆయకట్టు గల చెరువులు 906ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలవల్ల జిల్లాలోని 411 చెరువులు మత్తడి పారుతున్నాయి. 200 చెరువులు పూర్తిగా నీటితో నిండగా, 134చెరువులు సగానికిపైగా నిండాయి. 25శాతంలోపు నిండిన చెరువులు 179 ఉండగా, 25శాతం నుంచి 50శాతం వరకు148 చెరువులు నిండాయి. 50శాతం నుంచి 75శాతం వరకు 134చెరువులు నిండాయి. జిల్లా పరిధిలోని 14మండలాల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ కింద ప్రస్తుతవానాకాలం సీజన్‌లో 1,67,744 ఎకరాల్లో రైతులు వివిధపంటలను సాగు చేస్తున్నారు.

**● సాగునీటికి తీరిన కొరత...**

జిల్లాలోని పలు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి గత నెలలోనే నీరు చేరినా... అంతంత మాత్రంగానే నిండాయి. దీంతో ఆయకట్టు కింద రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురిసిన..

(మిగతా 8లో..)



ధర్మపురి శివారులో నిండిన అక్కనపల్లి చెరువు



పెగడపల్లి మండలం లింగాపూర్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్

## రోడ్డు ఇలా....నడిచేదెలా?



బురదమయమైన తాండ్ర్యాల - తుర్తి రోడ్డు

కథలాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాల-తుర్తి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా బురదమయమై రాకపోకలకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రతీదినం ఈ రోడ్డుపై పలు గ్రామాల ప్రయాణికులు, రైతులు వెళ్తుంటారు. రోడ్డంతా బురదమయమై మోకాలి లోతు గుంతలు ఏర్పడి కనీసం కాలినడకకు కూడా వీలులేకుండా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులు కేటాయించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



మల్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు

మల్యాల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జనహిత యాత్ర నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, బద్దం తిరుపతిరెడ్డి, రౌతు రవి, బద్దం తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, నగేష్, గడ్డం రాజేశం, మిట్టపల్లి దశరథం, శేఖర్, అరున్, సంగ సత్యం తదితరులు ఉన్నారు.బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**కొడిమ్యాల:** గంగాధర మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జనహిత పాదయాత్రను అడ్డుకుంటారన్న సమాచారంతో మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులను ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వెంకటి, స్వామి, చాంద్‌పాషా, రమేష్, ఆనందం, ప్రభుదాస్, రాకేష్, లక్ష్మన్, మాజీ సర్పంచులు మల్లేశంముదిరాజు, తిరుపతి, తదితరులు ఉన్నారు.

## జనహిత పాదయాత్రకు తరలిన నాయకులు



పాదయాత్రకు తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు

పెగడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన పాదయాత్రకు ఆదివారం పెగడపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెల్లారు. పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, కృష్ణహరి, తిరుపతి, రాజు, స్వామి, కిషన్, భాస్కర్ తదితర నాయకుల ఆధ్వర్యంలో పెగడపల్లి నుంచి చొప్పదండి నియోజకవర్గ పరిధిలో జరిగే పాదయాత్రకు తరలివెల్లారు.

## నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- మల్యాల సీఐ నీలం రవి



సమావేశంలో మాట్లాడుతున్న మల్యాల సీఐ రవి

పెగడపల్లి/కొడిమ్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మల్యాల సీఐ నీలం రవి పేర్కొన్నారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో, కొడిమ్యాల మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఆదివారం వినాయక మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులతో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నీలం రవి మాట్లాడుతూ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జరుపుకోవాలని, మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలని, నిమజ్జనం భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. సమావేశంలో పెగడపల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, కొడిమ్యాల ఎస్ఐ ఎస్. సందీప్, విద్యుత్ శాఖ కొడిమ్యాల ఏఈఈ రఘునాథ్, పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి, రాజశేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామెర రాంసుధాకర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంసుధాకర్‌రావు

ధర్మపురి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామెర రాంసుధాకర్‌రావు అన్నారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 5.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని ఆయన అన్నారు. సెప్టెంబరు మొదటి వారం నాటికి యూరియా సరఫరా కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. యూరియా పంపిణీలో అవకతవకలు జరిగి తేడా రావడం వల్లే గందరగోళ పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా యూరియ సరఫరా జరగడం లేదని పదేపదే చెప్పడం బీజేపీ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర మంత్రులు, మిగతా నాయకులు తమ మాటలు వెనక్కి తీసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో ధర్మపురి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నలుమాసు వైకుంఠం, మండల మాజీ అధ్యక్షుడు సంగెపు గంగారాం, మండల ఇన్‌చార్జి ఒగేటి అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న భగీరథ నీరు



మల్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల పరిషత్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ కుళాయి నుంచి నిరంతరం వచ్చే నీరు నిరుపయోగంగా మారుతోంది. పైప్‌లైన్ ఏర్పాటు చేసి కుళాయి అమర్చకపోవడంతో నీరు వృథాగా పోతున్నాయి. దీనికి పక్కన గల మరో రెండు కుళాయిల పరిస్థితి కూడా ఇలాగే ఉండడం విశేషం.

## 108లో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల అర్బన్/మల్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవలు అందిస్తున్న ఈఎంఆర్ఐ(108) నందు ఈఎంటీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, సంస్థ మేనేజర్ ఎస్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీ తదితర అర్హతలు గల 35 ఏళ్ల లోపు ఉన్నవారు ఈ నెల 26న జగిత్యాలలోని ధర్మపురి రోడ్డులో గల ఎస్‌వీఎల్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

## సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాగ్యనగర్ కాలనీ వాసులు

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం అవుతున్న సెల్ టవర్ పనులను నిలుపుదల చేయాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆదివారం లేఖను రాశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా టవర్ల నిర్మాణం జరుగుతుండడం సమంజసం కాదన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులకు వంద మీటర్ల దూరంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టాలని స్పష్టంగా నిబంధనలున్నప్పటికీ భాగ్యనగర్‌లో పాఠశాలకు, నివాసిత ప్రాంతాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. దీనివల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపి చర్మ సంబంధిత, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపించి నిర్మాణ పనులను నిలిపివేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు పంపిన లేఖలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కోరారు.

**జగిత్యాల అర్బన్:** జగిత్యాల పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ వాసులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఆదివారం కలిశారు. తమ నివాస గృహాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నా రని ఈ విషయమై అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికి అధికారులు స్పందించడం లేదని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ కాలనీ వాసులు, మాజీ కౌన్సిలర్ మొగిలి, మల్యాల మాజీ జడ్పీటీసీ రాంమోహన్‌రావు ఉన్నారు.

## పురుగుల మందుతాగి యువకుడి బలవన్మరణం



నవీన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రేకుల నవీన్(43) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ భార్య సుజాత మద్యం తాగవద్దని ఎన్నిమార్లు చెప్పినా వినలేదు. ఈనెల 23న అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నవీన్‌ను కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుజాతతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. నవీన్ తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన గాజుల రవీందర్ గౌడ్(30) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్‌గౌడ్ పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. సంవత్సర కాలంగా స్వగ్రామమైన ములకలపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆరు నెలలుగా భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. గొడవలతో విసిగిపోయిన రవీందర్ మనస్తాపంతో పురుగు మందు తాగాడు. దీనిని గమనించిన బంధువులు అతన్ని హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గాజుల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

జ్యోతినగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్‌లో ఆదివారం రాత్రి కొంపెల్లి భీమమ్మ(65) అనే వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పని మనిషి ఇంటికి వచ్చిన సమయంలో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకొన్న విషయాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. మృతురాలి బంధువులు అందుబాటులో లేరు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## యువకుడి మృతదేహం లభ్యం



రామ్‌అనుజ్(ఫైల్)

ఓదెల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానగొండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం గొల్లపల్లి సమీపంలోని రైల్వేపట్టాల పక్కన సిమెంట్ కాలువలో ఆదివారం యూపీ రాష్ట్రం, సుల్తాన్పూర్ జిల్లాలోని సజ్వాన్ హరినాథ్‌పూర్‌కు చెందిన రామ్‌అనుజ్ యాదవ్(29) అనే యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మూడురోజుల క్రితం గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్‌రైలులో హిటార్సి నుంచి బెంగళూర్‌వైపు ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తీవ్రగాయాలతో మృతదేహం కుళ్లిపోయి ఉందని, మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు లభించాయని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

## గుండెపోటుతో న్యాయవాది మృతి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన సీనియర్ న్యాయవాది శేషాల సారంగం(66) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కాంగ్రెస్‌పార్టీ బ్లాక్‌బి అధ్యక్షుడు మొలుగూరి సదయ్య పుష్పాంజలి ఘటించి భౌతికకాయానికి కాంగ్రెస్ పార్టీ కండువా వేశారు. ఆయనవెంట మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్, పొనగంటి రవీందర్ ఉన్నారు.

## ప్రమాదకరంగా లక్ష్మీపూర్-వెల్ది రోడ్డు



లక్ష్మీపూర్‌లో కల్వర్టుకు ఏర్పడిన గొయ్యి

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లక్ష్మీపూర్-వెల్ది గ్రామాల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుపై గొయ్యి ఏర్పడింది. ఈ ప్రదేశంలో గ్రామస్థులు మట్టిని పోసి కర్రలను పెట్టారు. ఈ రూట్‌లో నిత్యం ఆర్టీసీ బస్సు, ఇసుక ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెలుతుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రివేళలో ఎదురెదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు గొయ్యి కనబడడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గొయ్యిపడి సుమారు 20 రోజులు దాటినా మరమ్మతు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# విదేశాల్లో ఉన్నత విద్య కోసం 'విద్యానిధి'



- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్
- బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఓవర్సీస్ పథకం




చొప్పదండి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు విద్యానిధి ఓవర్సీస్ పథకం వరంగా నిలుస్తున్నది. విదేశాల్లో విద్య ఖర్చుతో కూడుకున్నది కాగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు అందని ద్రాక్షగా మారేది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకాలు విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. పేద విద్యార్థుల కలను నెరవేర్చి విదేశాల్లో విద్యను చదివేందుకు ఆలంబనగా నిలుస్తున్నాయి.

### అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశాల్లో విద్యనందించే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం వరంగా మారింది. రూ.20లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను ఎంపికైన విద్యార్థులకు అందజేస్తుంది. దీంతో పాటు విమాన ఖర్చులు, వీసా ఖర్చులను భరిస్తుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాల్సి ఉండగా కుటుంబంలోని ఒకే విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ విద్యార్థులు జీఆర్ఈ, జీమ్యాట్, ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌లో అర్హత సాధించాలి. ఎస్టీ విద్యార్థులు జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, పీఈటీలో అర్హత సాధించాల్సి ఉంటుంది. కాగా ఈ నెల 31లోగా ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి.

### బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథకం..

బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథకం దోహదపడుతున్నది. ఈ పథకం కింద కూడా రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలి. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండడంతోపాటు జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఇఎల్‌టీఎస్, పీటీఈలో అర్హత మార్కులకు ఆధారంగా ఎంపిక చేస్తారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ పథకానికి కూడా ఈనెల 31 లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

# అన్నారం టు జగిత్యాల.. కలప అక్రమ రవాణా



అన్నారంలోని ఆలేటి చెరువు కట్టపై నిల్వ ఉంచిన కర్రలు

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామం నుంచి జగిత్యాల జిల్లాకు అక్రమ కలప రవాణా కొనసాగుతోంది. అన్నారం గ్రామంలోని మామిడితోటలు, తుమ్మ, వేపచెట్లను నరికివేస్తూ కలపను కరీంనగర్- జగిత్యాల జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అన్నారం ఆలేటి చెరువు కట్టపై కర్రలను నిల్వ చేసి లారీలు, వ్యానులలో కర్రలను పేర్చి అవి కనబడకుండా తాటిపత్రితో కట్టి రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. కలప అక్రమ రవాణా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని పచ్చునూర్, కెల్లేడు, రంగపేట, లక్ష్మీపూర్, వెల్ది, వేగురుపల్లి, రంగపేట, ఊటూర్, దేవంపల్లి, చెంజర్ల తదితర గ్రామాల్లో చెట్లను నరికివేస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించి చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వ్యవసాయ బావిలో పడిన రెండేళ్ల బాలుడు

- గాలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది



కౌశిక్ నంద(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చేరాల వెంకటయ్య-కావ్యల రెండేళ్ల కొడుకు ఆడు కుంటూ వెళ్లి వ్యవసాయ బావిలో పడిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కావ్య కొడుకును తీసుకొని మధ్యాహ్నం సమయంలో వారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లింది. బాలుడిని ఒడ్డుపై ఉంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఇంతలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడిపోయాడు. బావిలో ఏదో పడిన శబ్దం విన్న కావ్య తలెత్తి చూసింది. ఒడ్డుపైన ఆడుకుంటున్న బాలుడు కనిపించలేదు. దీంతో కావ్య లబోదిబోమంటూ బాలుడి కోసం చూసింది. ఎక్కడా కనిపించకపోయే సరికి బాబే బావిలో పడ్డాడని భావించి చుట్టపక్కల వారిని పిలిచింది. అక్కడికి చేరుకున్న సమీప పొలాల రైతులు, కూలీలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు బాలుడి మృతదేహం వెలికితీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడం, బావి చుట్టూ పొదలు అల్లుకపోయి ఉండడంతో బాలుడి మృతదేహం వెలికితీతకు ఆలస్యం అవుతోందని పోలీసులు పేర్కొన్నారు. బావికి మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. రాత్రి వరకు బాలుడి మృతదేహం లభ్యం కాలేదు.

## డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట రూ.1.48లక్షల స్వాహా

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట సైబర్ నేరగాళ్లు ఓవిద్యార్థి నుంచి రూ.1.48 లక్షలు స్వాహా చేశారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ వావిలాలపల్లికి చెందిన బి శ్రీపీతం అనేవిద్యార్థి పైచదువుల కోసం వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 8న ఇండియన్ ఎంబసీ పేరుతో శ్రీపీతంకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ జరుగుతోందని, ఫీజు చెల్లించాలని పేర్కొన్నాడు. నాలుగు దఫాలుగా ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.1,48,200 పంపించాడు. ఆ తరువాత గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్‌చేయగా స్విఛాప్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల పనేనని గ్రహించి వెంటనే 1930 నంబరులో ఫిర్యాదు చేశాడు. దీనిపై కరీంనగర్ త్రీ టౌన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

## డీఎల్‌ఎడ్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఎల్‌ఎడ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు మరోసారి స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండలంలోని ఎల్ఎండీలో గల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025ఉత్తీర్ణులై అర్హత, ఆసక్తి ఉండి ఇప్పటి వరకు ప్రవేశంపొందని అభ్యర్థులు డీసెట్2025 వెబ్‌సైట్‌ను పరిశీలించి తమ మాధ్యమంలో తమతమ కేటగిరి సీట్లుఖాళీగా ఉన్న కళాశాలలను తెలుసుకోవాలని అన్నారు. అన్నిఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొని ఈనెల 26న ఉదయం 10గంటలకు ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థకురావాలని, 28న ప్రైవేటు కళాశాలకు ఉదయం 10గంటలకు వెళ్లి సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## సందడే.. సందడి..

- ఎగువ మానేరుకు భారీగా సందర్శకులు



ఎగువ మానేరు జలాశయం వద్ద భారీగా సందర్శకులు

గంభీరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి భారీగా కన్పించింది. మానేరు మత్తడి దూకడం తగ్గుముఖం పట్టినా ప్రాజెక్టు అందాలను చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. మానేరు మత్తడి దూకే ప్రాంతం సందర్శకులతో సందడి సందడిగా మారింది.

## చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కొండచిలువ



కొండచిలువతో అసిరి సుమన్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని డీర్‌పార్క్ పక్కన ఉన్న చేపపిల్లల ఉత్పత్తికేంద్రం వద్ద ఆదివారం ఓ కొండచిలువ చేపలవలలో చిక్కుకొని కనిపించింది. దీంతో గమనించిన సిబ్బంది జంతుసంరక్షణశాలకు సమాచారం అందించారు. జంతుసంరక్షణశాల అధ్యక్షుడు అసిరి సుమన్ పటేల్ కొండచిలువను బయటకు తీసి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

## మారమ్మ తల్లికి మొక్కులు



దప్పువాయిద్యాలతో వెళ్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్, వేములకుర్తి గ్రామాల అభివృద్ధి కమిటీలు, కుల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మారమ్మతల్లి, గ్రామ దేవతలకు మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల్లో అమ్మవారికి బోనం, చీరె, సార తదితర వస్త్రాలు, పూజసామగ్రిని ఎదుర్కొంటు వెళ్లారు. పలుచోట్ల పోత రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పంటలు సమృద్ధిగా పండాలని, సీజన్లో వచ్చే అనారోగ్య సమస్యల నుంచి పిల్లాపాపలను చల్లగా చూడాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని శనివారం అర్ధరాత్రి సమయంలో లేక్‌పోలీసులు కాపాడారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన వేల్పుల సంపత్(39) ప్రస్తుతం కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబసభ్యుల సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు మానేరుజలాశయం కట్టపైకి ఎక్కాడు. అక్కడ విధుల్లో ఉన్న లేక్ అవుట్‌పోస్ట్ హోంగార్డు శ్రీనివాస్ గమనించి అడ్డుకున్నాడు. అనంతరం సంపత్‌కు లేక్ అవుట్ పోస్ట్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబసభ్యులను పిలిపించిన అప్పగించారు. సమయానికి స్పందించి సంపత్ ప్రాణాలు కాపాడిన హోంగార్డు శ్రీనివాస్‌ను పోలీస్‌కమిషనర్ గౌస్‌ఆలం అభినందించారు.

## రెండు ఇళ్లలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో తాళాలు వేసిఉన్న కరివేద కరుణాకర్‌రెడ్డి, లెంకల రామచంద్రరెడ్డి ఇళ్లలో ఈనెల23 అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రూ.5వేలు, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

# ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

- ఎనిమిది గేట్లు తెరిచి.. 24,640 క్యూసెక్కులు దిగువకు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల



దిగువకు విడుదలవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల ఆదివారం కొనసాగింది. ఎనిమిది గేట్ల ద్వారా 24,640 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 54,187 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదగేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 54,187క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరదకాలువకు 20,000క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు.

### కొనసాగుతున్న ఎత్తిపోతలు..

**ధర్మారం:** గోదావరి జలాల ఎత్తిపోతలు 12రోజులుగా కొనసాగుతున్నాయి. ఈనెల 13 నుంచి మూడు పంపుల ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించారు. అప్పటి నుంచి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఒక్కో రోజు రెండు, మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5-30గంటల వరకు మొదట మోటార్లను రన్‌చేశారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద నీరు ఎల్లపల్లి ప్రాజెక్టుకు వస్తుండడంతో నిర్విరామంగా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం రెండుమోటార్ల ద్వారా 6300క్యూసెక్కుల నీటిని ఎగువకు ఎత్తిపోయగా, ఆదివారం ఒక మోటారు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని లక్ష్మి పూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తు న్నారు.



గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

### ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల..

**పెద్దపల్లి:** శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 89,138క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. 10 గేట్ల ద్వారా 70,248క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. అలాగే నంది పంపు హౌస్‌కు 3150క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడినుంచి గాయత్రి పంప్ హౌస్ మీదుగా అంతేమొత్తంలో నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను, 19.925టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

### సుందిళ్ల బ్యారేజీలో పెరిగిన గోదావరి వరద..

**మంథని రూరల్:** మండలంలోని సిరిపురం వద్ద ఉన్న సుందిళ్ల బ్యారేజీలో ఆదివారం గోదావరి వరద పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి గోదావరిలోకి 73,994 క్యూసెకుల వరద నీరు బ్యారేజీ లోకి వస్తుండటంతో అధికారులు వరద నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. రెండు రోజుల క్రితం వర్షాలు తగ్గడంతో వరద నీరు తగ్గింది.

### గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటివిడుదల..

**రామడుగు:** రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క పంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అదినేరుగా వెళ్లి వరదకాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి 18,500క్యూసెక్కుల నీరు వరదకాలువలో 99వ కిలోమీటర్ల వద్ద కలుస్తోంది. దీంతో ప్రస్తుతం 21,650క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అయితే మిడ్ మానేరుకు 21,650 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. వరదకాలువ నిండుకుండలా తయారై కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

### అన్నపూర్ణలోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

**ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 9900క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

### మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

**బోయినపల్లి:** శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటిప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రంవరకు 18,218క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగు తోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్ హౌస్ నుంచి 31,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 313.77, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 17.897 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

### 9 టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ రిజర్వాయర్

**తిమ్మాపూర్:** ఎగువ నుంచి, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్(ఎంఎంఆర్) నుంచి వస్తున్న నీటి ఇన్‌ఫ్లోతో దిగువమానేరు జలాశయం 9.07 టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.977 టీఎంసీలు ఉంది. ఎంఎంఆర్ నుంచి 9489 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తుండటంతో 229క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

# ఓట్ చోరీతోనే

## బండి సంజయ్ గెలుపు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

కరీంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్‌చోరీతోనే కరీంనగర్‌లో బండి సంజయ్‌కుమార్ గెలుపొందాడని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం గంగాధర మండలంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి జనహిత పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు దొంగోట్లతోనే గెలిచారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. రాహుల్‌గాంధీ బయటపెట్టిన ఓటర్ జాబితా చూస్తే స్పష్టమవుతుందన్నారు. లక్షలకు పైగాదొంగ ఓట్లు చేర్పడం, ఒకే అడ్రస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రస్‌లపై వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఒకే ఎపిక్ నంబర్ పై వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం ప్రజాస్వామ్యా నికి ప్రమాద మన్నారు.

**ఎన్నికలు వస్తేనే బీజేపీకి దేవుళ్లు గుర్తుకువస్తారు..**

ఎన్నికలు వస్తే బీజేపీకి దేవుళ్లు గుర్తుకు వస్తారని, దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం ఏంటన్నారు. రాముడి అక్షంతలను సైతం రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు. దేవుళ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా ఓట్లు అడిగిందా అని ప్రశ్నించారు. కులం మతం లేక పోతే బీజేపీ గెలవలేదన్నారు. దేవుడి పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లని, కొండగట్టు అంజన్న పేరుతో బీజేపీ నేతలు ఓట్లు అడుగుతున్నారన్నారు. ఎన్నికలు వస్తే వారికి హిందూ, ముస్లింల కొట్లాట గుర్తుకు వస్తుందని అన్నారు. బండి సంజయ్ బీసీల గురించి ఏనాడైనా మాట్లాడావా అని ప్రశ్నించారు.



కురిక్యాల నుంచి పాదయాత్రగా బయల్దేరి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం, అడ్లూరి, వివేక్

బీసీల గురించి రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో బిల్లును రూపొందించి ఢిల్లీకి పంపిస్తే ఆమోదించడం లేదని విమర్శించారు. బండి సంజయ్ నిజమైన బీసీ నాయకుడు కాదని, బీసీల బిల్లుపై మాట్లాడకుండా ఢిల్లీలో కిషన్‌రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడన్నారు. బండి సంజయ్ బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్ అని విమర్శించారు. బండి సంజయ్ భవిష్యత్ బీసీ తరాలకు ద్రోహం చేస్తున్నాడ న్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ పార్టీ ఏనాడూ పేదల గురించి ఆలోచించ లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిగా కనుమ రుగవుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో గెలు పొంది చొప్పదండిలోనే విజయోత్సవ సమావేశం నిర్వహి స్తామన్నారు.



◄ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట రాజన్ మాటాడుతూ పేదల కష్టాలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేస్తున్నామన్నారు. పేదల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ నేత వెంకటస్వామి సేవలను గుర్తు చేస్తూ తెలంగాణలో ఆయన పేరుతో తెలియని వారు లేరన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, ప్రభుత్ విప్ ఆదిశ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమ్మోహన్, రుద్ర సంతోష్, అల్పోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కురిక్యాల నుంచి మధురానగర్ జనహిత పాదయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

### చివరి రక్తం బొట్టు వరకు సేవ చేస్తా

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**గంగాధర:** తన చివరి రక్తంబొట్టు వరకు చొప్పదండి నియోజకవర్గానికి సేవ చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా గంగాధర మండలం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో దోచుకు న్నదని విమర్శించారు. ఒక్క ఎకరానికైనా కొత్తగా బీఆర్‌ఎస్ వాళ్లు నీళ్లు ఇవ్వలేదని, ఒకవేళ ఇచ్చి ఉంటే నేలకు ముక్కు రాస్తానని అన్నారు. నారాయణపూర్ ఎత్తు పెంచి సాగు ఆయకట్టు పెంచతామని, కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

### ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవు: మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవని మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి అన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం దశాబ్దకాలంలో పేదలకు ఒక్క ఇల్లు అయినా కట్టారా అని ప్రశ్నించారు. గృహ నిర్మాణ శాఖ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టి రాహుల్‌గాంధీ రెండు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు.

### బీసీ రిజర్వేన్లు ఇచ్చి తీరుతాం

**రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు**



బీసీ రిజర్వేషన్ల ఇచ్చి తీరుతామని రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు అన్నారు. తనకన్నా పెద్ద రామభక్తుడు ఎవ్వరని ప్రశ్నించారు. దేవుళ్ల పేరిట బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## ఫార్మసీ ఆఫీసర్ల మెరిట్ లిస్టు ప్రకటించాలి





మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్

సుభాష్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో మెడికల్ అండ్ హెల్త్‌సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్స్‌కు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. ఆదివారం కరీంనగర్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫార్మసిస్టుల 50ఏళ్ల చిరకాల స్వప్నం ఫార్మసీ ఆఫీసర్‌కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసీఆఫీసర్లకు ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించడంలో జాప్యం తగదని, కోర్టు కేసుతో సంబంధం లేకుండా వెంటనే ఫలితాలు ప్రకటించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితోపాటు ప్రిన్సిపల్‌సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 104సర్వీస్‌లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్‌కు ఐదునెలలుగా కంటిన్యూయేషన్ లేక జీతాలు నిలిపివేశారని, ఈ విషయంపై హెల్త్ కమిషనర్‌తో చర్చించి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్‌కేలో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లకు కూడా ప్రతీనెల జీతాలు సక్రమంగా రావడానికి కృషిచేస్తానన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్ కళ్యాణ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లాల్లో జిల్లాఫార్మసీ ఆఫీసర్ల నియామకం, డీవీఎస్‌లలో కూడా ఫార్మసీ ఆఫీసర్ల పోస్టులు ఉండేలా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లందరికి సమాన పనికి సమాన వేతనం అందేలా కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ ప్రసాద్, పంద్రాల శంకర్, విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సలహాదారు అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇన్‌ఫార్మసీ ఆఫీసర్లకు విద్యార్హతల ఆధారంగా డైటీషియన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ అనాలసిస్టు పోస్టులలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఉమ్మడిజిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుతురు రవీందర్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కరీంనగర్ కార్యదర్శి సుధాకిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజమల్లు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ జంషీద్‌అలీ, కార్యదర్శి ఎండీ షౌకత్‌అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లాఅధ్యక్షుడు సతీష్, కార్యదర్శి రాజ్‌కుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వగ సుధాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, అసోసియేట్ ప్రెసిడెంట్ అవినాష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్, మురళీధర్ రెడ్డి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రముఖుల పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

కరీంనగర్ అర్బన్/మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీఅధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం గంగాధర మండలంలో ఆదివారం జనహిత పాదయాత్ర కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ వాల్మీకినగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కాల్ వేణుగోపాల్‌రావు, గనులు, భూగర్భశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, టీపీసీసీ అధికారప్రతినిధి మేన్నేని రోహిత్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్, బెజ్జంకి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ ఉన్నారు.

- ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కవ్వంపల్లిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా సహకారబ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం, మాజీ సుడా డైరెక్టర్ కామారపు శ్యాం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్ర శ్రీనివాస్, మాజీ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాయకులు ఉన్నారు.

### సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మణికంఠరెడ్డి



మణికంటరెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యునిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సీపీఐ నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మణికంటరెడ్డి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన తనఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

- కిటకిటలాడిన ఆలయాలు



నృసింహుడి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు నరసింహ, గోవింద నామ స్మరణలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలిఛైర్మన్ జక్కురవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకుసేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయసూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, అలువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

**ఘనంగా గోపాల కాల్వలు..**



ధర్మపురి క్షేత్రంలో ఆర్యవైశ్య మహిళల కోలాట నృత్యం

శ్రావణమాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాలకాల్వలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోక క్షేమార్థం ఏటా నిర్వహించే విధంగా ఉదయం దివంగత ప్రముఖ వ్యాపారి చాడ గంగన్న కుటుంబసభ్యులు స్థానిక లక్ష్మీనరసింహ స్వామి, రామలింగేశ్వరస్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ఉగ్రనారసింహుని ఆలయంలో రాజరాజేశ్వరీ భజనమండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజన చేశారు. అనంతరం ఆర్యవైశ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు. దారిపొడవునా చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, చాడ కుటుంబ సభ్యులు చాడ శ్రీనివాస్, వెంకటరమణ, శ్రీనాథ్, ధర్మపురి పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఆర్యవైశ్య వర్తక సంఘాల మండల, పట్టణ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### యూరియా కొరతకు కేంద్రం కారణం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని సీపీఎం జిల్లాకార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇవ్వాల్సిన కోటాలో కోతపెట్టడం వల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడిపెంచి రాష్ట్రానికి రావాల్సినకోటాను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం అశోక్, బాసర సంపత్‌రావు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర ఆలయంలో పనులు వేగంగా పూర్తి చేయాలి

- భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలి
- సమీక్ష సమావేశంలో అధికారులతో విప్ ఆది శ్రీనివాస్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ మొదటిదశ అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తులకు భీమేశ్వర ఆలయంలో దర్శనాలు కల్పించేందుకు జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బీ గితే, ఈవో రాధాబాయితో పాటు వివిధశాఖల అధికారులతో ఆదివారం ఆలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా రాజన్న ఆలయానికి వచ్చిన వీరికి ఆలయఅర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేకపూజలో పాల్గొన్న అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర ఆలయంలో కల్యాణ మండపం, హోమం, వ్రతమండపం, షెడ్ నిర్మాణం, క్యూలైన్లు, సీసీఫ్లోరింగ్ పనులు చేపడుతామన్నారు. భక్తులకు దర్శనం కోసం చేస్తున్న పనులపై ఆరాతీశారు. సమ్మక్క-సారక్కజాతర వస్తున్ననేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

## ముగిసిన యూత్ కాంగ్రెస్ నిరాహార దీక్ష





నిరాహార దీక్షలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు

గణేశ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన్‌ప్రతిష్ట కరీంనగర్‌జిల్లా అధ్యక్షుడు వుమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా వద్ద ఓట్ చోర్ మోడీ హటావో దేశ్‌కి బచావో అనే నినాదంతో చేపట్టిన రిలేనిరాహార దీక్ష ఆదివారం ముగిసింది. సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, సూడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి, పొన్నం మధు మాట్లాడుతూ దేశంలో విచ్చలవిడిగా బీజేపీ పెద్దలు ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ఆధారాలతో సహా కాంగ్రెస్ అగ్రనేత బట్టబయలు చేసినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఓట్ల చోరీపై తక్షణమే ఎలక్షన్ కమిషన్ స్పందించాలని,ఓట్లజాబితాను తొలగించాలని డిమాండ్ చేశారు. యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిన కృష్ణబాబు, కిమ్‌ఫహద్, సయ్యద్ సజాద్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్, ఎల్కపెల్లి సిద్ధార్థ, పురుషోత్తం, వడ్డేపల్లి విష్ణువర్ధన్, ఉమ్మెత్తుల ఆశీష్‌రెడ్డి, దూడ శ్రీకాంత్, మాట్ల రాజేష్, శనిగరపు దినేష్, వినీత్, సూరంసాయి,మహిళా నాయకురాలు రాజేశ్వరి అనూష పాల్గొన్నారు.

## మొక్కజొన్న రక్షణకు..రైతుల పాట్లు

- నష్టపరుస్తున్న కోతులు, రామచిలుకలు
- మండలంలో 8,600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు



మైకుతో కాపలా కాస్తున్న రైతు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టాలకు ఓర్చి ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే పంటలు చేతికి వచ్చే దశలో కోతులు, రామ చిలు కలు రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మొక్క జొన్న పంట దశలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. కోతులు, అడవిపందులు, రామ చిలుకల బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు పంట చుట్టూ చీరలు కట్టి రక్షించుకుంటే మరికొంతమంది రైతులు చుట్టూ జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో మైకులను అమర్చి కొందరు రైతులు పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.



కంకులను నాశనం చేసిన చిలుకలు



మొక్కజొన్న పంటకు చీరలతో రక్షణ

ఇబ్రహీంపట్నం మండ లంలో సుమారుగా 8,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. పంట 100 నుంచి 120 రోజుల్లో కోతకు వస్తుంది. విత్తనం నాటిన నుంచి సుమారుగా 70 రోజుల్లో మొక్కజొన్న కంకులు వస్తా యి. అక్కడి నుంచి సుమారుగా నెల రోజుల పాటు మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండాల్సి వస్తోంది. పంట నాటిన నుంచి ఏదో ఒక రకంగా రైతులు ఇబ్బందులకు గురవుతూనే ఉంటారు. కొన్ని రోజులు వర్షాభావ పరిస్థితులతో, యూరియా కొరతతో కొన్ని రోజులు, భారీ వర్షాలతో మరి కొన్ని రోజులు ఇలా పంట చేతి కొచ్చే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### ఆర్చరీ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న చికిత

ఎలిగేడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి శ్రీలత శ్రీనివాస్‌రావు కూతురు తానిపర్తి చికిత కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ అండర్21 చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నది. ఆర్చరీలో శిక్షణ పొందిన ఆమె స్పోర్ట్స్ అథారిటీ తరపున కెనడాలో జరుగుతున్న పోటీలో పాల్గొంది. శనివారం చాంపియన్‌షిప్ సాధించింది. మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీఎంపీపీ తానిపర్తిస్రవంతి మోహన్ రావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.





మెడల్స్‌తో చికిత

● న్యూస్ బాక్స్..

### ఉచిత వైద్య శిబిరం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో నూర్ మసీద్ సమీపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జగిత్యాల పట్టణం లోని పావని ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, భారతి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాచకొండ శ్రీనివాస్, డాక్టర్ రాచకొండ నాగరత్న, కళ్యాని డెంటల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎన్. రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరం లో రెండు వందల మందికి పైగా రోగులను పరీక్షించి అవసరమున్న వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన నూర్ భాషా మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### రాజన్నసిరిసిల్ల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

కథలాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజన్నసిరిసిల్ల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించబడ్డ తాండ్ర్యాలకు చెందిన రాచమడుగు వెంకటేశ్వర్ రావును మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు ఆదివారం సన్మానించారు. బొమ్మెన, గంభీర్‌పూర్, తాండ్ర్యాల గ్రామాలకు చెందిన నాయకులు శాలువాలతో సన్మానం చేశారు. సీనియర్ నాయకుడిగా పార్టీకి అనేక సేవలు అందిస్తున్న వెంకటేశ్వర్‌రావుకు జిల్లా పదవి రావడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, పిడుగు ఆనంద్‌రెడ్డి, కాశోజీ ప్రతాప్, బద్రి సత్యం, సునీల్, శ్రీనివాస్, నవీన్, మహేందర్ తదితరులు ఉన్నారు.

# అధ్వాన దారి.. ప్రమాదకరంగా మారి..

- వర్షాలకు దెబ్బతిన్న కోనాపూర్-సూరంపేట రోడ్డు - పట్టించుకోని అధికారులు - ఆందోళన చెందుతున్న ప్రజలు

కొడిమ్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మూడు వారాలుగా అడపాదడపా కురిసిన వర్షాలకు మండలం లోని కోనాపూర్ నుంచి సూరంపేట గ్రామానికి వెళ్లే రోడ్డు దెబ్బతిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోనాపూర్ బస్ స్టేజీ నుంచి సూరంపేట గ్రామ మలుపు వరకు కుంట కట్టపై ఉన్న సుమారు రెండు కిలో మీటర్ల రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో పాటు, రోడ్డు పక్కన అప్రోచ్ రోడ్డు కొంత భాగం కుంగిపోయింది. రోడ్డు పక్కన కుంగిపోవటంతో వాహనాలు నడపడం కష్టంగా మారింది. నిత్యం వందలాది



గుంతలు పడ్డ రోడ్డు, కుంట సమీపంలో కోతకు గురైన రోడ్డు

వాహనాలు కోరుట్ల నుంచి మేడిపల్లి, గోవిందారం మీదుగా మండలంలోని సూరంపేట నుంచి కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పూడూర్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా సూరంపేట, గంగారాంతండా గ్రామాల ప్రజలు విద్యార్థులు మండల కేంద్రానికి గుంతలు పడ్డ రోడ్డుపై భయంభయంగా ప్రయాణం చేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్డును మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదని గంగారాంతండా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కోనాపూర్ నుంచి సూరంపేట వరకు దెబ్బతిన్న రోడ్డు మరమ్మతుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కృషి చేయాలని సూరంపేట, గంగారాంతండా ప్రజలు కోరుతున్నారు.

### తారు వేయరు... గుంతలు పూడ్చరు



**పెగడపల్లి (ఆంధ్రజ్యోతి):** పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వి పూడ్చి ఏళ్లు గడుస్తున్నా తారు రోడ్డు నిర్మాణం చేయక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం లింక్-2 కాలువ నిర్మాణంలో భాగంగా పెగడపల్లి గోపాల్‌రావుపేట రోడ్డులో నామాపూర్ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వి పెద్ద పైపులు వేశారు. పైపులైన్ వేసి రోడ్డును పూడ్చినప్పటికి కొన్నేళ్లుగా సంబంధిత కాంట్రాక్టర్ దాదాపు రెండు వందల మీటర్ల రోడ్డును తారు నిర్మాణం చేయాల్సి ఉండగా గుంతలు పూడ్చయకుండా వదిలేయడంతో గుంతలలో నీరు నిలిచి ద్విచక్రవాహన దారులు, కార్లు గుంతలు దాటేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గుంతలతో పలు ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తారు వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### రోడ్డు మరమ్మతు చేయించాలి

- బొజ్యానాయక్, మాజీ సర్పంచ్ గంగారాంతండా



వర్షాలకు దెబ్బతిన్న కోనాపూర్ గ్రామ బస్ స్టేజీ నుంచి సూరంపేట గ్రామ బస్‌స్టేజీ వరకు ఉన్న రోడ్డును మరమ్మతు చేయించాలి. గతంలో ఈ రోడ్డు కుంట కట్టపై నిర్మాణం జరిగినందున వాహనాలు ఏదైనా ప్రమాదం జరుగుతె నీటిలో పడిపోయె అవకాశం ఉంది. ప్రమాదాలు జరగక ముందు రోడ్డు మరమ్మతు చేయించి విద్యార్థులకు ప్రజలకు సౌకర్యంగా చేయాలి.

### రోడ్డంతా గుంతలు...

**రాయికల్ (ఆంధ్రజ్యోతి):** రాయికల్ పట్టణంలోని ఒకటో వార్డులో కల్లు మండువా నుంచి శివాలయం వరకు దాదాపు రెండు కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలు, బొందలు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం వేలాది మంది వాహన చోదకులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నా యి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతు న్నారు. వాహన చోదకులు జారిపడి గాయాల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. పాదాచా రులకు నడవడం కూడా మరింత కష్టంగా మారిం ది. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణం రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



### చెరువులకు జలసిరి

(5వ పేజీ తరువాయి)

భారీ వర్షాలతో చెరువుల్లోకి నిండుగా నీరు చేరడంతో జలకళను సంతరించుకున్నా యి. ఆయకట్టుకు నీటి కొరత తీరడంతో పాటు మూగ జీవాల దాహార్తి సైతం తీరనుంది. దీంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి.

**● ఇరు శాఖల సంయుక్త పర్యవేక్షణ...**

ప్రస్తుత యేడాది వరద కారణంగా జిల్లా వ్యాప్తంగా చెరువులకు బుంగలు, గండ్లు తదితర అంశాలపై అధికారులు సంయుక్తంగా పర్యక్షిస్తున్నారు. నీటి పారుదల శాఖ, వరదలతో నిండిన చెరువులకు గండ్లు పడకుండా రెవెన్యూ, చిన్ననీటిపారుదల శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చెరువులు, కుంటల స్థితిగతులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తూ రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం నివేదించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**● 544.1 మిల్లీమీటర్ల వర్షపాతం..**

ప్రస్తుత సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదైంది. సారంగపూర్ మండలంలో మినహా ఇతర ప్రాంతాల్లో సాధారణ, లోటు వర్షపాతం నమోదు అయింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 615.7 మిల్లీమీటర్లు కాగా 544.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి, బుగ్గారం, మేడిపల్లి, కోరుట్ల, మల్యాల, వెల్గటూరు, ఎండపల్లి, బీమారం మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది. జగిత్యాల, జగిత్యాల రూరల్, మెట్‌పల్లి, కథలాపూర్, మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

### యాదవ సంఘం మండల కార్యవర్గం



చేకుట శేఖర్

సారంగాపూర్, ఆగస్టు, 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం అఖిల భారత యాదవ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా చేకుట శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మానుక తిరుపతి, ఉపాధ్యక్షులుగా కుడుకల శంకర్, దానవేని స్వామి, అధికార ప్రతినిధిగా కారు వెంకటేష్, యూత్ అధ్యక్షుడిగా ఎంకూసు మధుయాదవ్, ఉపాధ్యక్షుడిగా పన్నాల రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు పాలమూరి మల్లేష్, ఉపాధ్యక్షుడు మల్లేష్, అధికార ప్రతినిధి బైరి మల్లేష్ యాదవ్‌కు నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భార్గవ రామ్

గొల్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో సరైన ప్రాతినిధ్యం లేక అన్ని రంగాల్లో వెనకబడి పోయారని వారికి పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ కోరారు. ఆదివారం ఆయన గొల్లపల్లి మండల కేంద్రంలో మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నామంటూ మీడియాల్లో, సోషల్ మీడియాల్లో జబ్బలు చరచుకునే జాతీయ పార్టీల నాయకులకు బీసీ సామాజిక వర్గానికి చెందిన ధన్కడ్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తే బీసీలకే అవకాశం కల్పించాలనే సోయి లేకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం బీసీ పక్షపాతినంటూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రగల్భాలు పలికారన్నారు. అవకాశం వస్తే మాత్రం తమ సామాజికవర్గానికి చెందిన సుదర్శన్‌రెడ్డిని ఎలా ఎంపిక చేస్తారంటూ ప్రశ్నించారు. ఇదేనా బీసీల పట్ల మీకున్న పారదర్శకత అని ప్రశ్నించారు. దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న బీసీలకు రాజ్యాంగ బద్ధ పదవుల్లో సరైన ప్రాతినిధ్యం లేక అన్ని రంగాల్లో వెనకబడి పోయారని అవేదన చెందారు.

# సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

పెగడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సురవరం సుధాకర్ రెడ్డి మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లి మండల కేంద్రంలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కార్యదర్శి శనిగరపు ప్రవీణ్, రాచర్ల సురేష్, జుట్టు శేఖర్, మ్యాక చంద్రయ్య, అంజయ్య, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**మల్యాల (ఆంధ్రజ్యోతి):** సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజావామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత పేర్కొన్నారు. సుధాకర్ రెడ్డి మృతి పట్ల ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముఖ్రం, రజాక్, రమ, లలిత, జయశ్రీ, భూలక్ష్మి, రాధ, లక్ష్మి ఉన్నారు.

**కోరుట్ల:** సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై కోరుట్ల వామపక్ష నేతలు ఘన నివాళిని అర్పించారు. పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో ఆయన చిత్ర పటనికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, మక్రం, మౌలనా, తిరుపతి నాయక్, కొంచెం శంకర్, చింత భూమేశ్వర్, తుల రాజేందర్, చింతకింది గణేష్, అలీ, సంబార్ మహేష్, తోకల రాజలింగం, గంగాధర్, సింగం శ్రీహరి, రాస భూమయ్య పాల్గొన్నారు.

**మెట్‌పల్లిటౌన్:** టీజేఎస్ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు టీజేఎస్ పార్టీ నేత కోదండరాంతో కలిసి హైదరాబాద్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక దేహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పెగడపల్లి, కోరుట్లలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

### చిన్నయ్య దేవుడికి ప్రత్యేక పూజలు

గొల్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో చిన్నయ్య దేవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజాలు పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు డప్పు చప్పుళ్లు, డమరు కనాదాల నడుమ చిన్నయ్య దేవుడి ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ ఇష్టదైవానికి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు పదిహేనేళ్ల కిందట చిన్నయ్య దేవుడికి గజాలు ప్రతిష్ఠ చేశారు. మళ్లీ ఇన్నాళ్లకు పునఃప్రతిష్ఠ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



సత్యసాయి చిత్రపటాలతో చిన్నారులు, మహిళలు

వెల్గటూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలను పురస్కరించుకొని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వెల్గటూర్‌లో గ్రామోత్సవం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పల్లకి సేవతో నగర సంకీర్తన, భజన, సత్సంగము, స్వామి వారి తత్వం, లీలలపై సందేశం ఇచ్చారు. బాలవికాస్ కార్యక్రమాలు, చిన్నారులతో తల్లులకు మాతృపూజ జరిపించి తల్లిదండ్రులు, గురువుల ప్రాధాన్యతను గురించి అవగాహన కల్పించారు. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. గర్భిణులకు చీరె, సారే అందించారు. గ్రామ స్థాయిలో సేవలు అందించే అంగన్‌వాడీ టీచర్లు, సైనికోద్యోగికి సన్మానం చేశారు. కార్యక్రమంలో జగిత్యాల సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, వెల్గటూర్ భజన మండలి కన్వీనర్ గట్ల రాజేందర్, వంగల లక్ష్మీనారాయణ, గుండ రాజశేఖర్, నలమాసు రాజశేఖర్, అర్వపెల్లి ఆనంద్, పిప్పరి రాజేందర్, ఠాకూర్ నారాయణ్ సింగ్, అమిరిశెట్టి ప్రభు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

### మహాగర్జన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి సతీష్

రాయికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సెప్టెంబరు 1న నిర్వహించనున్న దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి నక్క సతీష్ మాదిగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్ పెంచుతామని నమ్మించి అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలలు కావస్తున్నా పెన్షన్‌దారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. మండల కేంద్రంలో సెప్టెంబరు 1న నిర్వహించనున్న సన్నాహక సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, జిల్లా ఉపాధ్యక్షుడు భువనగిరి కిషన్, జిల్లా కార్యదర్శి మీసాల సాయిలు, రాయికల్ మండల దివ్యాంగుల అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడు పసుల గంగాధర్, ప్రధాన కార్యదర్శి చెంగలి మహేష్, నాయకుడు పాలెపు బాలరాజు, సభ్యులు సుధాకర్, గంగారాం, తిరుపతి, రాజేందర్, రాజు, పద్మ పాల్గొన్నారు.

### పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజెంగి అశోక్, ఉపాధ్యక్షుడిగా బోగ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పారిపెల్లి నారాయణ, కోశాధికారిగా ఎనుగందుల గణేష్, ప్రచార కార్యదర్శిగా శ్రీపతి లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధికి, సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జక్కుల శేఖర్, జిల్లా కోశాధికారి తుమ్మ రాజేశం, రాయికల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీష్, ఆడెపు నర్సయ్య, కడకుంట్ల నరేష్, మ్యాకల కాంతారావు, తాటిపాముల విశ్వనాథం, బొమ్మకంటి రాంగోపాల్, ఆయా గ్రామాల పద్మశాలి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

### వృద్ధుల్లో మానసిక స్థైర్యం నింపేందుకే సదస్సులు



జగిత్యాల అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల్లో మానసిక స్థైర్యం నింపేలా జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడకుండా పిల్లలు బాధ్యత తీసుకోవాలని కోరారు. వృద్ధులను ఇంటి నుంచి గెంటి వేయడం, ఆస్తులను బలవంతంగా రాయించుకోవడం, అనాథ శరణాలయాల్లో బలవంతంగా చేర్పడంతో వారు మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ గుర్తింపు కార్డుల జారీని సంక్షేమ శాఖ పునరుద్ధరించాలని, వృద్ధుల కేసుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, ఇటీవల సంక్షేమ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి గతంలో లాగానే స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో పీసీ హన్మంత్‌రెడ్డి, డిండిగాల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

### కోటిలింగాలలో రక్తదాన శిబిరం



రక్త దానం చేస్తున్న బీజేపీ నాయకులు

వెల్గటూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జన్మదినం సందర్భంగా ఆదివారం కోటిలింగాలలో బీజేపీ నాయకులు రక్తదా న శిబిరం నిర్వహించారు. అంతకు ముందు పార్వతీకోటేశ్వరస్వామి వారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కొమ్ము రాంబాబులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కన్నం అంజయ్య, మద్రిపెల్లి సత్యం, నలమాసు వైకుంఠం, కస్తూరి మురళి, అనసూయ, రావు హనుమంతరావు, శేఖర్, కుమ్మరి తిరుపతి, పల్లె మోహన్ రెడ్డి, కీర్తి మధుకర్, కొక్కు బాలకృష్ణ, ఐటీ సెల్ సాయి, జక్కుల మహేష్, దుంపటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్:** కోరుట్ల పట్టణ మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిజామాబాదు ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరంను నిర్వహించారు. పట్టణంలోని అయిలాపూర్ రోడ్డుని ఓ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి నాయకులతో పాటు మండల స్థాయి నాయకులు రక్తదానం చేశారు. సేకరించిన రక్తంను జిల్లా రెడ్ క్రాస్ సభ్యులకు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రఘు, వడ్డెపల్లి శ్రీనివాస్, ఎర్ర లక్ష్మి నియోజకవర్గంలోని బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు

కోరుట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో కరాటే పోటీల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం గ్రేడింగ్ టెస్టును నిర్వహించి బెల్ట్‌లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కరాటే శిక్షణ పొందిన వారికి ఎగ్జామినర్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ గందె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ కోచ్, జగిత్యాల జిల్లా తైక్వాండ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ నవనంది రమేష్, మాస్టర్ల మణిదీప్, మహేష్ పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం

గొల్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లె గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బోయపోతు నర్సయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రాఘవ పట్నం, గంగాదేవి పల్లె గ్రామాల ప్రజలు 70 వేల రూపాయల ఆర్థికసాయం ఆదివారం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు.

# గణపతి నవరాత్రులకు పటిష్ట భద్రత ఏర్పాట్లు

- సీసీ కెమెరాల ఏర్పాటు, బైండోవర్లు
- నిబంధనలు పాటించాలని పోలీసుల సూచనలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణంలో గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకునేలా పోలీసు యంత్రాంగం భద్రత ఏర్పాట్లు చేస్తోంది. వినాయక మండపాల్లో విగ్రహాలు ఏర్పాటు, నిమజ్జన సమయంలో పాటించాల్సిన నియమాలు, పండగను శాంతియుతంగా నిర్వహించేందుకు మెట్‌పల్లి పోలీసులు చర్యలు చేపట్టారు. విగ్రహాల ఏర్పాటులో, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమావళి తదితర అంశాలపై కమిటీ సభ్యులకు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక చవితి వేడుకల్లో శాంతి భద్రతల పరిరక్షణలో విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అనుమానితులు, పాత నేరస్తులను మొత్తం 62 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పట్టణం, పల్లెల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మండపాల వద్ద సౌండ్, లౌడ్ స్పీకర్లను ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని, ట్రాఫిక్ నియంత్రన వంటి వాటిపై వినాయక కమిటీ సభ్యులు, నిర్వహకులకు అధికారులు అవగాహన కల్పించారు. వినాయక మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి చేశారు. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అందులో ఫోన్ నంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యాక, అవసరమైన వివరాలను ఎంపిక చేసుకునే విధంగా ప్రత్యేకంగా సైట్‌ను పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేసింది. దరఖాస్తును పరిశీలించిన తర్వాత కోడ్‌ను మండపం వద్ద తప్పకుండా నిర్వహకులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారులు సూచించిన నిబంధనలు తప్పకుండా పాటించాలని కమిటీ సభ్యులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



### నిబంధనలు పాటించాల్సిందే..

- కిరణ్‌కుమార్, ఎస్సై మెట్‌పల్లి



గణపతినవరాత్రోత్సవాల్లో ప్రతీ ఒక్కరు నిబంధనలు తప్పకుండా పాటించాలి. వినాయక ఉత్సవ కమిటీలు మండపాల ఏర్పాటు తీసుకోవాలి. లౌడ్ స్పీకర్లతో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉపయోగించాలి. మండపాల్లో రాత్రిపూట కమిటీ సభ్యులు కాపలా ఉండాలి. మండపాల్లో విలువైన వస్తువులను ఉంచకూడదు.